సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 7 । అక్టోబర్ । 2024



అప్పన్నకు ఆర్జిత సేవలు 8లో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు.



తీరంలో సందడి 8లో

పరవాడ మండలంలో తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి.



ధైర్యలక్ష్మిగా కనకమ్మ 8లో

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు ధైర్య లక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

మోదమ్మను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



కలెక్టర్ దంపతులు దినేష్‌కుమార్, విజయ్‌కృష్ణన్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లిని అల్లూరి, అనకాపల్లి కలెక్టర్ దంపతులు ఏఎస్ దినేష్‌కుమార్, విజయక్రృష్ణన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు పాల్గొన్నారు.

జెన్‌కో ఏడీఈకి సత్కారం



ఏడీఈ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఈఈలు

సీలేరు: స్థానిక జెన్‌కో కాంప్లెక్స్‌లో ఏడీఈగా పదోన్నతిపై వెళ్తున్న ఏబీడీ ప్రసాద్‌ను ఆదివారం చీఫ్ ఇంజనీరు వాసుదేవరావు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఆయనకు వీటీపీఎస్‌కు బదిలీ అయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సీలేరు పంప్డ్ స్టోరేజ్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ రాజేంద్రప్రసాద్, ఏడీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులపై అట్రాసిటీ కేసు నమోదు



పాడేరు సీఐ దీనబంధుకు ఫిర్యాదు చేస్తున్న సుజాత సాల్మన్

పాడేరు : గిరిజన మహిళను కించపరిచిన విద్యాశాఖకు చెందిన ముగ్గురు ఉద్యోగులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పాడేరు సీఐ దీనబంధు తెలిపారు. అరుకువ్యాలీకి చెందిన సుజాత సాల్మన్ అనే గిరిజన మహిళ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భర్త దేవదాసుకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు ఈనెల 3న పాడేరులోని డీఈవో కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో తనను ఏడీ వినయ్ మోహన్, జూనియర్ అసిస్టెంట్లు వినీల్, వీరబాబు వినీల్, వీరబాబు కించపరిచేలా ప్రవర్తించారని సుజాత సాల్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

వికసించిన బ్రహ్మకమలాలు



ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పిడిమి అప్పన్న ఇంటి పెరట్లో బ్రహ్మకమలాలు విరబూశాయి. వీటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- మంత్రి దుర్గేష్



బొర్రా గుహలకు వచ్చిన మంత్రి దుర్గేష్

అనంతగిరి (అరకులోయ రూరల్): పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆశాఖ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఆదివారం ఆయన బొర్రా గుహలు, తైడా పర్యాటక కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 2.0లో భాగంగా బొర్రా గుహలను రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. బొర్రా గుహల నుంచి పంచాయతీకి రావాల్సిన 20 శాతం వాటాకు సంబంధించి రూ.8కోట్లు బకాయి ఉందని, ఈ మొత్తాన్ని తక్షణం ఇప్పించాలని సర్పంచ్ అప్పారావు కోరారు.

గంజాయి అక్రమ రవాణాలో తగ్గేదేలే..

- స్మగ్లర్ల కొత్త పంథా
- ఒడిశా కేంద్రంగా వాహనాల్లో ప్రత్యేక బాక్సులు ఏర్పాటు
- పోలీసుల తనిఖీల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు

"పుష్ప.. ఈ సినిమాలో హీరో పుష్పరాజ్ ఎర్ర చందనాన్ని తరలించడంలో దిట్ట. అక్రమ రవాణాలో అటవీశాఖ అధికారులను ఏవిధంగా బురిడీ కొట్టించాడో తెలిసిందే. ఏజెన్సీలో గంజాయి స్మగ్లర్లు కూడా అదే పంథాను ఎంచుకుంటున్నారు. సరకు వేరైనా తరలించే విధానం మాత్రం సేమ్ టూ సేమ్. వీరిని చూసిన పోలీసులు నివ్వెరపోతున్నారు. అంచనాలకు అందని విధంగా వివిధ మార్గాలను ఎంచుకుంటున్నా.. కొన్ని సందర్భాల్లో మాత్రమే పోలీసులకు చిక్కుతున్నారు."



వాహనం పైకప్పులో ఏర్పాటుచేసిన బాక్సులో అమర్చిన గంజాయి ప్యాకెట్లు



గంజాయితో పట్టుబడిన వాహనం, నిందితులతో ముంచంగిపుట్టు పోలీసులు (ఫైల్)

ముంచంగిపుట్టు: ఏవోబీలో ఈ మధ్యకాలంలో గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఆటో, జీపు, వ్యాన్, లారీల్లో ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేసి తరలిస్తూ కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఎవ్వరూ గుర్తించని విధంగా వాహనాల్లో ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటుచేసి తరలిస్తున్నారు.

ఒడిశా కేంద్రంగా..

ఒడిశాలోని మల్కన్‌గిరి ,జైపూర్, కోరాపుట్టు ప్రాంతాల్లో గంజాయి రవాణాకు అనువుగా వాహనాలను మార్పు చేస్తున్నారు. ఎవ్వరికీ అనుమానం రాకుండా ప్రత్యేకంగా అరలను తయారు చేయిస్తున్నారు. ఈ వ్యవహారంలో వెల్డింగ్ కేంద్రాలు కీలకంగా మారాయి. ఇదంతా రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలింపునకు అనువుగా వాహనాలు రూపుదిద్దుకుంటున్నాయి. కేజీ ప్యాకెట్లు పట్టేలా అరలు అమర్చుతున్నారు. పది కిలోల గంజాయి పెట్టేలా అరలు అమర్చితే రూ.20 వేలు, వంద కిలో లు అమర్చేలా ఏర్పాటుచేస్తే రూ.2 లక్షలు తీసుకుంటున్నట్టు తెలిసింది. అరలు అమర్చిన తరువాత ఎటువంటి అనుమానం రాకుండా టింకరింగ్ చేస్తున్నారు. ఇలా చాకచక్యంగా తరలిస్తూ స్మగ్లర్లు పోలీసులకు సవా ల్‌గా మారుతున్నారు. వీరిని పట్టుకోవడంలో పోలీసులు కూడా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ వాహనాన్ని సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తూ గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు.

గంజాయి సాగుకు స్వస్తి పలికినా..

జిల్లాలో గంజాయి సాగు తగ్గుముఖం పట్టినా అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో సాగు పూర్తిగా తగ్గింది. వేల ఎకరాల్లో గంజాయి పంటను ఎస్‌ఈబీ, పోలీసు అధికారులు ధ్వంసం చేశారు. అయినప్పటికీ గంజాయి అక్రమ రవాణా మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. ఆంధ్రా, తెలంగాణలో ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు మాత్రం జిల్లాలోనే ఉంటున్నా యి. జిల్లాలో గంజాయి సాగు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో వ్యాపారులు ఒడిశాపై ఆధారపడుతున్నారు. అక్కడ కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నిల్వ చేసి అదను చూసి తరలిస్తున్నారు. ఈ విషయాన్ని దర్యాప్తులో గుర్తించిన పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వారి ఆగడాలకు చెక్ పెడుతున్నారు. గంజాయి రవాణాకు స్మగ్లర్లు అనుసరిస్తున్న మార్గాలను చూసి షాక్‌కు గురవుతున్నారు. జిల్లా లో గత రెండేళ్లలో వివిధ పోలీసుస్టేషన్లలో 246 కేసులు నమోదు కాగా 896 మందిని అరెస్టు చేశారు.43 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



ఏవోబీ సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగు

వ్యాన్ తొట్టి భాగంలో ప్రత్యేకంగా అర..

ముంచంగిపుట్టులో 2023 మార్చిలో గంజాయి తరలిస్తున్న బొలెరో వాహనాన్ని చాకచక్యంగా పోలీసులు పట్టుకున్నారు. వాహనం తొట్టి దిగువ భాగంగా అనుమానం రాకుండా ప్రత్యేకంగా పెట్టెను ఏర్పాటుచేశారు. ఇందులో రూ.5 లక్షల విలువైన 250 కిలోల గంజాయిని స్మగ్లర్లు అమర్చారు. ఒడిశా నుంచి ముంచంగిపుట్టు మీదుగా తరలిస్తుండగా ఈ పోలీసులు పట్టుకున్నారు. వాహనం ఖాళీగా ఉండటాన్ని గమనించిన వారు క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో రహస్యంగా ఏర్పాటుచేసిన బాక్సులో ఉంచిన గంజాయి పట్టుబడింది.

ట్యాంకర్‌లో భారీగా పెట్టె..

ఎవరికీ అనుమానం రాకుండా గంజాయి రవాణాకు స్మగ్లర్లు ట్యాంకర్లను వినియోగిస్తున్నారు. ఈ విషయాన్ని గతేడాది పాడేరు పోలీసులు గుర్తించారు. పాల ట్యాంకర్‌లో భారీగా పెట్టెను అమర్చారు. ఇందులో రూ.9.6 లక్షల విలువైన 480 కిలోల గంజాయి ప్యాకెట్లను తరలిస్తుండగా పాడేరులో పోలీసులు పట్టుకున్నారు. అనుమానంతో ట్యాంకర్‌ను పరిశీలించగా వెలుగుచూసింది.

నివ్వెర పోయేలా..



వాహనం పైకప్పులో అమర్చిన గంజాయి ప్యాకెట్లు

కారు సీట్ల కింద బాక్సు

గంజాయి రవాణాకు కార్లను సైతం అనువుగా స్మగ్లర్లు మార్చుకుంటున్నారు. ఈ విషయాన్ని 2023లో అరకు పోలీసులు గుర్తించారు. కారులో సీట్ల కింద రహస్యంగా బాక్సును ఏర్పాటుచేశారు. ఇందులో రూ.2.8లక్షల విలువైన 140 కిలోల గంజాయి ప్యాకెట్లను అమర్చి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనుమానంతో కారు మొత్తాన్ని తనిఖీ చేయగా ఈ వ్యవహారం వెలుగు చూసింది.

ఆటోల్లో ప్రత్యేకంగా బాక్సు

గంజాయి స్మగ్లర్లు ఆటోలను కూడా వదలడం లేదు. 2023 ఆగస్టులో వెలుగు చూసిన ఘటన ఈ విషయాన్ని వెల్లడి చేసింది. ఆటోకు దిగువ భాగంలో ఎవరికీ అనుమానం రాకుండా పెట్టెను అమర్చారు. ఇందులో 80 కిలోల గంజాయిని పేర్చి తరలిస్తుండగా అనంతగిరి పోలీసులు పట్టుకున్నారు.

తాజాగా వ్యాన్‌లో..

ఒడిశా నుంచి ముంచంగిపుట్టు మీదుగా గంజాయి తరలిస్తున్న బొలెరో వాహనాన్ని తాజాగా పోలీసులు పట్టుకున్నారు. అనుమానంతో తనిఖీ చేయగా వాహనం పైకప్పు భాగంలో అమర్చిన పెట్టెను పోలీసులు గుర్తించారు. దీనిని తనిఖీ చేయడంతో అందులో ఉంచిన రూ.6లక్షల విలువైన 120 కిలోల గంజాయి ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఈ కేసులో ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు.

పటిష్ట నిఘా



"ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి రవాణా అవుతున్నట్టుగా దర్యాప్తులో గుర్తించాం. దీంతో నిఘా పటిష్టం చేయడంతో వాహనాలు పట్టుబడుతున్నాయి. ఎప్పటికప్పుడు తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. గంజాయి స్మగ్లర్లు కూడా కొత్త మార్గాలు ఎంచుకుంటున్నారు. పోలీసుల కళ్లుగప్పి తరలించేందుకు ప్రయత్నిస్తూ పట్టుబడుతున్నారు. వారి ఎత్తుగడలకు చెక్ పెడుతున్నాం."

– కె.ధీరజ్, ఏఎస్పీ, పాడేరు

మొదటి యూనిట్‌కు త్వరితగతిన మరమ్మతులు

- చీఫ్ ఇంజనీరు వాసుదేవరావు ఆదేశం



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీరు

సీలేరు: స్థానిక జల విద్యుత్ కేంద్రంలో మొదటి యూనిట్‌కు మరమ్మతు పనులు వేగవంతం చేయాలని చీఫ్ ఇంజనీరు వాసుదేవరావు ఆదేశించారు. ఆదివారం ఇక్కడికి వచ్చిన ఆయన మొదటి యూనిట్ ఎప్పట్లోగా అందుబాటులోకి వస్తుందన్న విషయాన్ని అభిరామ్ కంపెనీ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. అనంతరం కంట్రోల్ రూమ్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. మిగతా యూనిట్ల పనితీరుపై ఆయన ఆరా తీశారు. మొదటి యూనిట్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈఈ రాజేంద్రప్రసాద్‌కు ఆదేశించారు. పంప్డ్ స్టోరేజీ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలో అరకు విద్యార్థి ప్రతిభ

- రెండు బంగారు పతకాలు సాధించిన లోహిత్‌బాబు



తల్లిదండ్రులతో లోహిత్‌బాబు

అరకులోయ రూరల్: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థి శెట్టి లోహిత్‌బాబు ప్రతిభ కనబరిచారు. ఈనెల 3,4,5 తేదీల్లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన అండర్–20లో 200,400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలను సాధించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు ప్రేమమల్లిక, సంజీవరావు తెలిపారు. తమ కుమారుడును అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, కోచ్‌లు జెసిన్, గణపతి, కొండల్‌స్వామిలకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

లలితా త్రిపురసుందరి అలంకరణలో అమ్మవార్లు



పాడేరులో రాజరాజేశ్వరిదేవి



సంగోడిలో పార్వతీదేవి



అరకులోయలో భ్రమరాంబదేవి

సాక్షి,పాడేరు: శరన్నవరాత్రుల్లో భాగంగా నాల్గోవరోజు ఆదివారం లలితా బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవార్లు దర్శనమిచ్చారు. పాడేరులోని కనకదుర్గ, రాజరాజేశ్వరి, సంగోడిలోని పార్వతీదేవి, అరకులోయలోని భ్రమరాంబదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయా ఆలయాల్లో సాయంత్రం భజన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

చాపరాయికి పోటెత్తిన పర్యాటకులు

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయికి ఆదివారం సందర్శకుల పోటెత్తారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. జైపూర్ జంక్షన్, రైల్వేగేట్ ప్రాంతాల్లో బంతిపూల తోటలో ఫొటోలు దిగారు. అరకు–పాడేరు జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.



చాపరాయి జలవిహారికి తరలివచ్చిన పర్యాటకులు

సిఫార్సుల సర్వేయర్లు

- ఏసీబీ కేసులు ఉన్న వారికే జీవీఎంసీలో పోస్టింగ్‌లు
- కూటమి ప్రజా ప్రతినిధులతో బేరసారాలు
- పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు
- ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఇంకా చేరని సర్వేయర్లు

మహారాణిపేట(విశాఖ): సర్వేయర్ల బదిలీల ప్రక్రియపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారదర్శకతకు దూరంగా బదిలీలు జరిగినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తీవ్ర ఆరోపణలు, ఏసీబీ కేసుల ఉన్న వారికి జీవీఎంసీలో పోస్టింగులు ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. కూటమి ప్రజా ప్రతినిధుల ఒత్తిడి, సిఫార్సుల మేరకు ఈ బదిలీలు జరిగాయని.. పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా.. కొంత మందికి ప్రాధాన్యం లేని చోట్ల పోస్టింగ్ రావడంతో వారు ఇంకా విధుల్లో చేరకపోవడం గమనార్హం. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సర్వే పనులకు విఘాతం కలుగుతోంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో దాదాపు 118 మంది సర్వేయర్లకు బదిలీలు జరిగాయి. కీలకమైన పెందుర్తి, ఆనందపురం, భీమిలి, గాజువాక, అనకాపల్లి, సబ్బవరం, పరవాడ, అచ్చుతాపురం, యలమంచలి తదితర మండలాల్లో సర్వేయర్ల పోస్టులు ఎక్కడా లేని ధర పలికాయి. ఇక్కడ పోస్టింగ్ దక్కించుకోవడానికి సర్వేయర్లు పోటీ పడ్డారు. నియోజకవర్గ ఎమ్మెల్యేలు సిఫార్సులు ఉంటే గాని పోస్టింగ్ రావడం లేదని తెలిసిన సర్వేయర్లు వారితో బేరసారాలకు దిగారు. కాగా.. జీవీఎంసీ పరిధిలోని ఏడు సర్వేయర్ల పోస్టుల్లో.. నాలుగు పోస్టింగుల మీద విమర్శలు వస్తున్నాయి. ఆరోపణలు, ఏసీబీ కేసులు ఉన్న వారికి ఇక్కడ పోస్టింగులు ఇవ్వడం మీద చర్చనీయాంశమైంది. అలాగే పెందుర్తి సర్వేయర్ నియామకం మీద కూడా ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ పోస్టింగులు అన్ని అనుకున్న ప్రకారం జరిగిపోయాయి. అలాగే వారు విధుల్లో కూడా చేరిపోయారు. ఇదిలా ఉండగా కొంత మందికి ప్రాధాన్యం లేని పోస్టింగు వచ్చాయి. అంటే అక్కడ డబ్బులు పెద్దగా రావు అన్నమాట! అలాంటి పోస్టింగుల్లో సర్వేయర్లు ఇంకా విధుల్లో చేరలేదు. ఇంకా రిలీవ్ చేయలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. బదిలీలు జరిగి 13 రోజులు దాటుతున్న ఇంకా విధుల్లో చేరలేదు. దీంతో వివిధ పనుల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్వేయర్ ఇంకా విధుల్లో చేరలేదని చెప్పి వెనక్కి పంపుతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ధైర్యలక్ష్మిగా కనకమ్మ

దాబాగార్డెన్స్ (విశాఖ): కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని లక్ష తులసితో పూజ నిర్వహించారు. సంకల్పం, మండపారాధన, కలశస్థాపన, సప్తశతి, మహావిద్యా, శ్రీచక్ర నవావర్ణార్చన తదితర పూజలు చేశారు. సోమవారం సంతానలక్ష్మిగా కనకమహాలక్ష్మి దర్శనమివ్వనున్నారని, కలువ పూలతో పూజ నిర్వహిస్తామని ఈవో కె.శోభారాణి తెలిపారు. ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

తీరంలో సందడి

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. గాజువాక, అనకాపల్లి, లంకెలపాలెం, సబ్బవరం, పరవాడ, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులతో తీర ప్రాంతాలు కళకళలాడాయి. ఉదయాన్నే చేరుకున్న సందర్శకులు తీరంలో ఆట పాటలతో సరదాగా గడిపారు. యువత డ్యాన్సులతో సందడి చేశారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలలో మునిగితేలారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా తీరంలో సముద్ర స్నానాలు ఆచరించి, తిరుగుముఖం పట్టారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

- ఘనంగా స్వర్ణపుష్పార్చన
- వైభవంగా నిత్యకల్యాణం



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటిండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యాధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

'సర్కిల్'తో మరింత రక్షణ

- పెదబయలు పోలీసుస్టేషన్‌ను సర్కిల్ ఆఫీస్‌గా మార్పునకు పనులు
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిధుల మంజూరు
- జి.మాడుగుల సర్కిల్ పరిధిలో మూడు పోలీసు స్టేషన్లు, రెండు అవుట్ పోస్టులు
- పెదబయలు సర్కిల్‌లో హుకుంపేట పీఎస్ విలీన అవకాశం
- శరవేగంగా భవన నిర్మాణ పనులు



పెదబయలు పోలీసుస్టేషన్ వద్ద నిర్మాణంలో ఉన్న సర్కిల్ కార్యాలయ భవనం

పెదబయలు: ప్రజలకు పోలీసు సేవలు మరింతగా చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లాల ఏర్పాటులో భాగంగా గత వైఎస్సార్‌సీపీ హయాంలోనే పెదబయలులో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పెదబయలు పోలీసు స్టేషన్ ఆవరణలో సర్కిల్ కార్యాలయం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం జి.మాడుగుల సర్కిల్ పరిధిలో జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, నుర్మతి అవుట్ పోస్టు, పెదబయలు మండలం రూడకోట అవుట్ పోస్టులు ఉన్నాయి. అయితే జి.మాడుగుల సర్కిల్ మండల పరిధికి చాలా దూరం కావడం వల్ల గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెదబయలులో సర్కిల్ ఏర్పాటుకు ప్రణాళిక చేసింది. ఈ మేరకు సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. ఎన్నికల కారణంగా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పెదబయలులో నూతన సర్కిల్ ఏర్పడితే ముంచంగిపుట్టు, రూడకోట అవుట్ పోస్టుతో పాటుగా హుకుంపేట పోలీసు స్టేషన్‌ను విలీనం చేసే అవకాశం ఉందని సమాచారం. పెదబయలు సర్కిల్ ఏర్పడితే మూడు మండలాల ప్రజలకు మరింతగా పోలీసు సేవలు అందుబాటులోకి రానున్నాయి. పోలీసు సేవలు మరింత సత్వరం కానుంది.

మావోయిస్టుల కార్యకలాపాలపై నిఘా

పెదబయలు సర్కిల్ కార్యాలయం ఏర్పడితే పెదబయలు, ముంచంగిపుట్టు.హుకుంపేట మండలాల ఏవోబీ సరిహద్దుల్లో మావోల కదలికలపై మరింతా నిఘా పెరిగే అవకాశం ఉంది.అలాగే అంతర్ రాష్ట్ర స్మగ్లింగ్ గంజాయి సాగు,రవాణాపై మరింతా నిఘా పెరుగుతుంది. అయితే పెదబయలులో సర్కిల్ ఏర్పాటుతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జి.మాడుగుల సర్కిల్ పరిధి ఎక్కువ కావడం వల్ల కొన్ని కేసులకు సంబంధిం జాప్యం జరుగుతుందని పెదబయలు సర్కిల్ ఏర్పాటుతో ఇబ్బందులు తొలుగుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేగవంతంగా పనులు

పెదబయలులో పోలీసు స్టేషన్ ఆవరణలో సర్కిల్ కార్యాలయం భవన నిర్మాణం వేగవంతంగా జరుగుతుంది. జి.మాడుగుల సర్కిల్ పరిధిలో జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల పోలీసు స్టేషన్లు, వారి పరిధిలో అవుట్ పోస్టులున్నాయి. అయితే పెదబయలులో నూతన సర్కిల్ ఏర్పడితే పెదబయలు, ముంచంగిపుట్టుతో పాటుగా కొత్తగా హుకుంపేట పీఎస్ విలీనం అవకాశం ఉంది. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీసుల సేవలు అన్ని వేళల్లో అందుబాటులో ఉండేలా చూస్తాం.

– సీహెచ్ వెంకటరావు, సీఐ, జి.మాడుగుల సర్కిల్

జనవరిలో బీచ్‌ఫెస్టివల్, విశాఖ ఉత్సవ్ నిర్వహణ

సాక్షి, విశాఖపట్నం : నగరంలో టూరిజం ప్రాజెక్టులు వేగవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. విశాఖ పర్యటనలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ అధికారులతో మంత్రి ఆదివారం రాత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక అధికారి(డీటీవో) జ్ఞానవేణి మంత్రిని మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో చేపట్టిన టూరిజం ప్రాజెక్టుల స్థితిగతుల గురించి మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ జనవరిలో బీచ్ ఫెస్టివల్‌తో పాటు విశాఖ ఉత్సవ్ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అన్నవరంలో నిర్మితమవుతున్న ఒబెరాయ్ 5 స్టార్ హోటల్ ప్రాజెక్టు గురించి మంత్రి ఆరా తీశారు.



మంత్రి దుర్గేష్‌కు స్వాగతం పలుకుతున్న జిల్లా పర్యాటకాధికారి జ్ఞానవేణి

యాత్రి నివాస్ పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఏపీటీడీసీ అధికారులను ఆదేశించారు. ఎంవీ మా షిప్ అభివృద్ధికి అవసరమైన అనుమతులపై దృష్టిసారించాలన్నారు.

ప్రసాద్ స్కీమ్ పనులు వేగవంతం చేయండి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులపై రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదివారం టూరిజం, దేవదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దేవస్థానంలో రూ.54 కోట్లతో చేపట్టిన ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే సంబంధిత ప్రణాళికలను పరిశీలించారు. సింహగిరిపై బస్టాండ్ బస్ బే ఏర్పాటు చేస్తే చందనోత్సవం, ఇతర ప్రధాన ఉత్సవాల్లో నెలకునే రద్దీ విషయం ప్రస్తావన వచ్చింది. దీంతో ఆ ప్రాంతంలో బస్‌బే ఏర్పాటు చేయడంపై రామచంద్రమోహన్ విముఖత వ్యక్తం చేశారు. అలాగే కొండ దిగువ, కొండపైన జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, టూరిజం ఏఈ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న రామచంద్రమోహన్

మోదమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



మోదకొండమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని భవానీ భక్తులంతా ఆదివారం భారీగా తరలివచ్చారు. భవానీ మాలధారణ చేసిన భక్తులంతా పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. భక్తుడు త్రినాథ్ ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం జరిగినట్టు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబునాయుడు చెప్పారు. కమిటీ సభ్యులు సతీష్, రాంబాబు, చంద్రమోహన్‌కుమార్, రమణ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బైక్ రేసర్లపై కేసులు

మధురవాడ: మధురవాడ ఐటీ సెజ్– రుషికొండ రోడ్‌లో బైక్ రేసింగ్‌లు జరుగుతున్నట్టు పక్కా సమాచారం అందడంతో పీఎంపాలెం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఐదుగురు రేసర్లను అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం ఇక్కడ కొందరు యువకులు రేసింగ్ పేరుతో అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా, పెద్ద పెద్ద శబ్దాలతో విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో స్థానికులు కొందరు పోలీసులు సమాచారమందించారు. దీంతో వై. తనోజ్, రిచర్డ్ సన్ లెవిన్, ఎం.వాసు, షేక్ ఆర్మన్, వి. జ్ఞానేశ్వర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కి పిలిపించి విశాఖ నార్త్ జోన్ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఎస్. కాంతారావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు జి. ప్రసాద్, భాస్కర రావు తదితరులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రేసర్లపై కేసు నమోదు చేసి వారి లైసెన్స్‌లు మూడు నెలలు రద్దు చేయడానికి ఎంవీ అధికారులకు సిఫార్స్ చేసినట్టు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

గంజాయి సాగుపై డ్రోన్లతో సర్వే

ముంచంగిపుట్టు: ఏవోబీ సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగుపై డ్రోన్లతో నిఘా పెడుతున్నట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. మండలంలో గల అత్యంత మారుమూల రంగబయలు, వనుగుమ్మ పంచాయతీల్లో పలు గ్రామాల్లో ఆదివారం పోలీసులు డ్రోన్‌తో వీడియోలు, ఫోటోలు తీసి ,గంజాయి సాగుపై తనిఖీలు చేశారు. కానీ ఎక్కడ గంజాయిని గుర్తించలేదు. అనంతరం ఆయా పంచాయతీల్లో గ్రామస్తులతో మాట్లాడారు. గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడవద్దన్నారు. నిరంతరం గంజాయిపై పోలీసు నిఘా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశఋురు. గంజాయి రవాణాలో పట్టుబడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



రంగబయలు గిరిజనులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీంద్ర

36 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆరిలోవ: రాత్రి సమయంలో ఆరిలోవలో ఓ వ్యక్తి గుట్టుగా పీడీఎస్ బియ్యం మిల్లుకు తరలించడానికి సిద్ధం చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్.ఐ కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ఎస్‌కేఎంఎల్ నగర్‌లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రేషన్ బియ్యం మూటలతో వేరే ప్రాంతంలో రైస్ మిల్లుకు తరలించడానికి వరద ప్రశాంత్ సిద్ధమయ్యాడు.

తన ఇంట్లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను వాహనంలో ఎక్కిస్తుండగా స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్.ఐ కృష్ణ, సిబ్బందితో అక్కడకు చేరుకొని బియ్యాన్ని పరిశీలించారు. ఆ బియ్యం బస్తాలలో కొన్ని రేషన్ సంచులతో కూడిన మూటలు కూడా ఉన్నాయి. ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి వాటిని మిల్లర్లకు విక్రయించడం నేరం. దీంతో బియ్యం బస్తాలు, వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఆ వ్యక్తి నుంచి సుమారు 36 బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని పౌర సరఫరా విభాగం అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

బిగిస్తున్న ఉక్కు పిడికిలి

- కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కదం తొక్కుతున్న కార్మికవర్గం
- మానవహారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికులు



కూర్మన్నపాలెం నుంచి వడ్లపూడి వరకు మానవహారంగా ఏర్పడిన కార్మికులు

అగనంపూడి : ఉక్కు పిడికిలి బిగిస్తోంది. రోజురోజుకూ ఉద్యమానికి మద్దతు పెరుగుతోంది. స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వ కవ్వింపు చర్యలతో కార్మికవర్గం కదం తొక్కుతుంది. ఇందులో భాగంగా ఆదివారం ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు అగనంపూడి నుంచి గాజువాక వరకు మానవహారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కార్మికులు మానవహారంలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం వైఖరిని ఖండించారు. పెద్ద ఎత్తున పోలీసులు, కేంద్ర బలగాలు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. రాస్తారోకోలు, ధర్నాలు జరగకుండా వారించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి సంఘీభావంగా వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఉక్కు ఉద్యమకారుడు బిషాయ్ కాళికాదేవి అవతారంలో పాల్గొని ఉద్యమకారులను ఉత్సాహ పరిచాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 87వ వార్డు పార్టీ నాయకులు మానవహారంలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



మానవహారంలో పాల్గొన్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

అగనంపూడి కూడలిలో...

అగనంపూడి కూడలిలో నిర్వాసిత కాలనీల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు తరలివచ్చి రాస్తారోకో నిర్వహించారు. తరువాత మానవహారం చేపట్టారు. పోరాట కమిటీ నాయకులు జి.బోసుబాబు, విళ్ల రామ్మోహన్‌కుమార్, పెదిరెడ్ల హరనాథ్, నీలకంఠం, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దూరం బట్టి ఇసుక ధరలు

- రవాణా, ఆపరేషనల్ చార్జీలు చెల్లించాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ బాగ్చి, జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: దూరం బట్టి ఇసుక ధరలు మారుతుంటాయని.. రవాణా, ఆపరేషన్ చార్జీలు చెల్లించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ దేశాలకు అనుగుణంగా ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నామని.. పాలసీకి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ప్రజల అవసరాల మేరకు రోజుకు 3,000 టన్నుల ఇసుకను పక్క జిల్లాల నుంచి తెప్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉచిత ఇసుక విధానం, ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియ, రీచ్‌లు, ఇతర అంశాలపై కలెక్టరేట్ వీసీ హాలులో సీపీ శంఖబ్రత బాగ్చి, జేసీ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 20 నుంచి అన్ని సచివాలయాలు, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చామని, ఇప్పటి వరకు 442 బుకింగ్‌లు జరిగాయన్నారు. 357 బుకింగ్‌లకు 7,000 టన్నుల ఇసుక సరఫరా చేశామని వివరించారు. బల్క్ ఆర్డర్లు 103 జరగ్గా సాంకేతిక కారణాలతో ఇవ్వలేదని.. వారందరికీ రెండు, మూడు రోజుల్లో ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. సవరించిన పాలసీ ప్రకారం ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేసి వినియోగదారుడి ఇంటి వద్దకే ఇసుక అందించడం ఒక పద్ధతి అని, రెండో పద్ధతిలో వినియోగదారుడు సొంత వాహనం ఏర్పాటు చేసుకుంటే రవాణా చార్జీలు మినహాయింపు ఉంటుందన్నారు. 24/7 ఆన్‌లైన్ బుకింగ్ (https:// sand. ap. gov. in) విధానం అందుబాటులోకి వస్తుందని, ఈ మేరకు అన్ని స్థాయిల్లో సిబ్బందికి, అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నానికి 190 కిమీ దూరం అండగా.. 20 మెట్రిక్ టన్నుల ఇసుక తెచ్చుకునేందుకు రూ.19,000 అవుతుందని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. దూరాన్ని బట్టి ధరలు మారుతాయని.. ఈ విషయాన్ని అందరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమాలకు పాల్పడితే రెండేళ్ల వరకు జైలు

ఇసుక అక్రమంగా తరలించినా, నిల్వ ఉంచినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా ఉంటుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. వీటిపై నిత్యం నిఘా ఉంచేందుకు రెవెన్యూ, పోలీస్, మైన్స్ అండ్ జియోలజీ, పంచాయతీ రాజ్ విభాగాల అధికారులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి రెండు తప్పులకు జరిమానా ఉంటుందని, మూడో సారి తప్పు చేస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, టోల్ ఫ్రీ నంబర్ 0891 2590100 ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు.

ర్యాగింగే కదా.. ఏమవుతుందిలే!



'డియర్ స్టూడెంట్స్.. ర్యాగింగ్ అనేది శృతి మించకూడదు. ఇకపై ఎవరూ ర్యాగింగ్ చేయకూడదు. ఒకవేళ ఎవరైనా పొరపాటున చేసినా.. చూసీచూడనట్లు సర్దుకుపోవాలి కదా.. మీకు మరీ అంత ఇబ్బందిగా అనిపిస్తే.. మా దృష్టికి తీసుకురండి.. అంతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించండి. లేదంటే.. తెలుసుకదా..' ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ కారణంగా.. బిక్కు బిక్కుమంటూ గడుపుతున్న బాధిత విద్యార్థినులతో ప్రొఫెసర్లు చెప్పిన మాటలివీ. ఒక ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ భూతం కోరలు చాస్తుంటే నిలువరించేందుకు జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి బాధిత విద్యార్థులకే హెచ్చరికలు జారీ చేయడం ఏయూకే చెల్లింది.

- సర్దుకుపోవాలంటూ విద్యార్థులకు కొందరు ప్రొఫెసర్ల క్లాస్
- 15 రోజులు సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్న కమిటీ
- చదువుపై దృష్టి సారించలేక పోతున్నామని విద్యార్థుల ఆవేదన

సాక్షి, విశాఖపట్నం : గత కొన్నేళ్లుగా ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా నిలిచిన ఏయూలో ర్యాగింగ్ భూతం మళ్లీ పేట్రేగుతుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఏయూలోని ఆర్కిటెక్చర్ విభాగ సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తూ ర్యాగింగ్‌కు పాల్పడ్డమే ఇందుకు నిదర్శనం. రోజురోజుకు సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ పర్వం శ్రుతిమించుతుండటంతో జూనియర్ విద్యార్థులు మానసికంగా కుంగిపోయారు. డ్యాన్స్ చెయ్యండి.. అని అడగడం.. డ్యాన్స్ రాదని జూనియర్లు చెబితే.. వెళ్లి.. అబ్బాయిల దగ్గర నేర్చుకొని డ్యాన్స్ చెయ్యండి అంటూ వారిని చిత్రహింసలకు గురిచేశారు. కేవలం హాస్టల్‌లోనే కాకుండా క్లాస్ రూమ్‌లలోనూ ర్యాగింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియర్ల ఆగడాలను తట్టుకోలేక తల్లిదండ్రులు, సన్నిహితులకు ఫోన్లు చేసి.. తమ మానసిక ఆందోళన గురించి చెప్పుకోవడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది.

తూతూ మంత్రంగా విచారణ

ర్యాగింగ్ వ్యవహారం బయటికి రావడంతో ఏయూ అధికారులు హడావుడి చేశారు. పలుమార్లు ప్రొఫెసర్లు, వీసీ ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని అధికారులు 'సాక్షి'లో కథనం ప్రచురితమవ్వడంతో స్పందించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించి 15 రోజులు సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. డ్యాన్స్‌ల వీడియోలు ఎవరి ఫోన్ నుంచి ఫార్వర్డ్ అయ్యాయి.. ఎవరెవరికి ఫార్వర్డ్ చేశారు.. ఇలా.. ఏ కోణంలోనూ విచారణ చేపట్టకుండా బాధిత విద్యార్థుల నుంచి సమాచారం తీసుకొని.. గుర్తించిన వారిపై సస్పెన్షన్ వేటు వేసేశారు. అయితే కేవలం ఆర్కిటెక్చర్ విభాగంలో మాత్రమే బయటికి వచ్చినా.. మిగిలిన విభాగాల్లోనూ ఇటీవల ర్యాగింగ్ జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఫిర్యాదులు చేస్తున్నా ఏయూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

బయటికి పొక్కకూడదు.. తస్మాత్ జాగ్రత్త

ఏయూలో ర్యాగింగ్ నిరోధానికి మూడంచెల కమిటీ పనిచేస్తోందా..? నిద్ర నటిస్తోందో అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ ర్యాగింగ్ ఘటన బయటకు రావడంతో కొందరు అధికారులు విద్యార్థులతో సమావేశమై.. ర్యాగింగ్ శృతి మించకూడదు. స్నేహపూర్వకంగా ఉండాలనీ.. ఒకవేళ ఇబ్బందిగా అనిపిస్తే.. నేరుగా తమ దృష్టికి తీసుకురావాలే తప్ప బయటకు వెళ్తే పద్ధతిగా ఉండదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఏయూ అధికార యంత్రాంగం వైఖరితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామనీ.. హాస్టల్ వద్ద చాలా ఇబ్బందికరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యవహారంపై సీరియస్‌గా ఉండాలనీ.. భవిష్యత్తులో మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.